

ఈ రేస్‌పై చర్చకు పట్టుబడుతూ శాసనసభలో స్పీకర్ పోడియం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను తప్పుబడుతూ శాసనమండలి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్సీలు

కేటీఆర్‌పై కేసు అక్రమం

ఫార్ములా ఈ-కార్ రేస్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ • దద్దరిల్లిన ఉభయసభలు.. పోడియం ఎదుట ఆందోళన

చర్చకు అనుమతించని స్పీకర్, మండలి చైర్మన్ • అసెంబ్లీ, మండలిలో పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు

హోరెత్తిన నినాదాలు.. ఒకటికి రెండుసార్లు వాయిదా • అసెంబ్లీలో నిరసనల మధ్యనే పొంగులేటి ప్రసంగం

అసెంబ్లీలో పోటాపోటీగా అధికార, ప్రతిపక్షాల నినాదాలు • శాసన మండలిలో చేతులెత్తేసిన సర్కార్.. సభ నేటికి వాయిదా

- **మేం తప్ప చేయలేదు.. రాష్ట్రం కోసమే పనిచేశాం**
- **తప్ప అంటున్నవారు చర్చ పెట్టి అదేమిటో చెప్పండి**
- **ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారు**
- **ఆయనకు చెప్పకొనే అవకాశం ఇవ్వాలి**
- **అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు శుక్రవారం ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. కేసుపై చర్చించాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో శాసనసభ, శాసనమండలి దద్దరిల్లాయి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యనే భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించగా, మండలిలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో అధికారపార్టీ పూర్తిగా విఫలమైంది. మండలిలో శుక్రవారం మూడు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. కేటీఆర్‌పై కేసును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉభయసభలకు హాజరయ్యారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చించాలని ఉభయసభల్లోనూ పట్టుబట్టి, సభను అడ్డుకున్నారు. దీంతో ఒకటికి రెండుసార్లు ఉభయసభలు వాయిదాపడ్డాయి. శాసనమండలిలో మూడోసారి సమావేశమైన తరువాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు.

దమ్ముంటే ఉంటే చర్చపెట్టండి

శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాగానే భూభారతిపై చర్చను చేపట్టనున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చను అనుమతించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'స్పీకర్ సార్ చర్చకు అనుమతించండి' అని విజ్ఞప్తి చేశారు. 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ లేవు. రాత్రి 12 గంటల వరకు చర్చిద్దాం.. ఈ-కార్ రేసింగ్‌పై చర్చకు అనుమతించాలి' అని కోరారు. ప్రభుత్వానికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అయినా స్పీకర్ అనుమతించలేదు.

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకే

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని, ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా తాము కూడా ప్రజలకు చెప్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెట్టింది అక్రమ కేసు కాకుంటే సభలో చర్చించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

కొనసాగిన ఆందోళన..

మళ్లీ సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూ భారతిపై చర్చ అనంతరం తన చాంబర్‌కు పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు శాంతించలేదు. ఇదే సమయంలో మంత్రి పొంగులేటికి స్పీకర్ మాట్లాడే అవకాశమిచ్చారు. భూ భారతిపై మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ తర్వాత బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు 'బడే భాయ్.. ఛోటే భాయ్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదావేశారు. విరామం తర్వాత అసెంబ్లీ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనకు పోటీగా అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కొందరు సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అత్యంత వేగంగా హరీశ్‌రావును సమీపించారు. 55 మంది మార్షల్స్ సభలో మోహరించారు.

ఆ ఎమ్మెల్యే వైఖరి వివాదాస్పదం

సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వైఖరి వివాదాస్పదమైంది. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆయన పేపర్ విసిరే ప్రయత్నం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత ఆయన చెప్పు తీసి విసరబోయారని, వాటర్ బాటిల్ విసిరేయబోయారంటూ సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. ఇటీవలే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భౌతిక దాడులకు దిగుతామని బెదిరించారు. 'వెలమల్లారా ఖబర్దార్.. కుట్రలు చేసే వెలమల వీపులు విమానాలు మోగుతాయ'ంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో తాజా వివాదం మొదలైంది.

మండలిలో చేతులెత్తేసిన సర్కార్

- **పది నిమిషాలైనా సాగకుండానే సభ వాయిదా**
- **మూడు బిల్లులు ప్రవేశపెట్టలేకపోయిన ప్రభుత్వం**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో శాసనమండలి దద్దరిల్లింది. ఒకటికి రెండుసార్లు సభను వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రావడంతో చివరకు ఏ చర్చా జరగకుండానే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని స్థంభింపచేశారు. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సభ సాగకపోవడంతో చైర్మన్ తొలుత 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఉదయం 11:20 గంటలకు మండలి సమావేశం తిరిగి ప్రారంభమైనప్పటికీ, బీఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. చర్చ లేకుండానే చైర్మన్ సభను శనివారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

చైర్మన్ వారించినా

కేటీఆర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని సభలో చర్చ పెట్టాలన్న డిమాండ్లతో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులను మండలి చైర్మన్ వారించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. కేసుపై చర్చ జరగాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో చైర్మన్, మంత్రులు నిశ్చేష్టులయ్యారు.

లోకం పోకడ



ఐదేళ్లలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఎలా? పుస్తకం వుందా?

విపక్షాలకు మైక్ కట్

- **మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడ్తరు**
- **కొత్త రూల్.. అంటూ పోలీసుల దబాయింపు**
- **అధికారపక్షానికి మాత్రం అన్ని అనుమతులు**
- **బీఆర్ఎస్ సభ్యులకు అడుగడుగునా ఆంక్షలే..**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారపక్షం ఏది చేసినా ఒప్పే.. ప్రతిపక్షం ఏది చేసినా తప్పే.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ సర్కారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. సభలో, మీడియా పాయింట్ వద్ద మాట్లాడే విషయంలో, నిరసన తెలిపే అంశంలో ఈ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. శాసనసభలో తమ అభిప్రాయం చెప్పేందుకు విపక్షాలకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. సభను వాకౌట్‌చేసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకూ విపక్షానికి అవకాశం ఇవ్వడం లేదు. కొత్త రూల్ అంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం సభను వాకౌట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా.. పది మంది మార్షల్స్ అడ్డుకున్నారు. వాకౌట్‌కు కారణాలు, సభలో పరిస్థితులపై మీడియా ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లో ప్రధాన ప్రతిపక్షం గొంతు వినిపించకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. అధికారంలో ఉండి కూడా అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమో అధికారపక్ష ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపడంపైనా సర్కారు ఆంక్షలు విధిస్తున్నది.

ఎనభై ఏళ్లుగా బతుకు పోరాటం

కనీస సౌకర్యాలకూ నోచుకోని 'గండ్రబంధం'

గిరిజన కుగ్రామం చుట్టూ మూడు వాగులు

ఎటునుంచి వెళ్లాలన్నా ఐదు కిలోమీటర్లు నడిచి వాగు దాటాల్సిందే..

వర్షాకాలంలో చుట్టుముడుతున్న వరద

అటువైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ యంత్రాంగం

ఒకవైపు దేశం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతోంది. కానీ ఆ గిరిజన కుగ్రామం మాత్రం కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండ్రబంధం గ్రామంలోని గిరిజనులు గత 82 ఏళ్లుగా బాహ్య ప్రపంచానికి దూరంగా నివసిస్తున్నారు. కేవలం వ్యవసాయం చేసుకోవడమే వీరికి తెలిసింది. గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లాంటివి కూడా లేవు. గ్రామం చుట్టూ మూడు వాగులు ఉన్నాయి. గ్రామం నుంచి బయటకు రావాలంటే వాగులు దాటాల్సిందే. సుదీర్ఘకాలంగా వెతలతో విసుగుచెందిన గిరిజనులు ఆ గ్రామాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం తమకు మరోచోట స్థలం చూపించాలని కోరుతున్నారు.

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 20

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్త చింతకుంట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గండ్రబంధం గ్రామం చుట్టూ మూడు వాగులున్నాయి. ఈ గ్రామం చింతకుంట గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇటువైపు నుంచి వెళ్లాలంటే దోనేటి వాగు, గండ్ర వాగులు దాటాలి. వర్షాకాలంలో ఇవి ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. అలాగే మరో దారి తోకబందాల గ్రామం నుంచి కూడా ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మధ్యలో కిన్నెరసాని పెద్దవాగును దాటాల్సి ఉంటుంది. వర్షాకాలంలో కిన్నెరసాని పెద్దవాగు గండ్రవాగులకు నీటి ఉధృతి ఎక్కువగా వస్తుంది. దీంతో ప్రతి ఏడాది గ్రామాన్ని ఈ నీరు చుట్టుముడుతుంది.

గండబంధం గ్రామం వ్యూ

అనారోగ్యానికి గురైన వ్యక్తిని దోనెలో తీసుకెళ్తున్న గ్రామస్తులు

మోకాళ్లలోతు పారుతున్న నీటిలో వాగు దాటుతున్న గ్రామస్తులు

ఏ అభివృద్ధికి నోచుకోకుండా...

నేటి ఆధునిక యుగంలో గ్రామాలు కూడా ఆల్ట్రా మోడల్‌లో అభివృద్ధి చెందుతున్నాయి. కానీ గండ్రబంధం మాత్రం అభివృద్ధిలో దశాబ్దాలుగా వెనుకబడి ఉంది. ఏ గ్రామంలో అయినా కనీస సౌకర్యాలు ఉంటాయి. ఇక్కడ విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు కూడా ఇక్కడ లేవు. కేవలం ఈ గ్రామంలో ప్రభుత్వపరంగా మంచినీరు, కరెంట్ ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పని చేయడం లేదు. వాగు నీళ్లే తాగుతున్నారు. ఏఎన్ఎం కూడా రాకపోవడంతో ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా ఐదు నుంచి పది కిలోమీటర్లు వెళ్లాలి. జ్వరం వస్తే కనీసం మందు బిళ్ల ఇచ్చే దిక్కు కూడా ఇక్కడ లేదు. గ్రామంలో మట్టిరోడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ గ్రామస్తులు ఇక్కడ వ్యవసాయం చేసుకునే జీవిస్తున్నారు. ప్రతి వర్షాకాలం గ్రామం చుట్టుపక్కల ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తుంటాయి. దీనివల్ల గ్రామంలోని వరద వచ్చి ఇళ్లు దెబ్బతింటున్నాయి. ఇళ్లల్లోని సామాన్లు కూడా పాడవుతున్నాయి. అయినా వీరి పరిస్థితిని ఏ అధికారీ పట్టించుకోవడం లేదు.

గ్రామంలో ఉండలేక...

ఇన్ని సమస్యల మధ్య గ్రామంలో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 82 ఏళ్లుగా ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా... ఇక్కడే పుట్టి పెరిగిన బంధంతో అవస్థలను ఎదుర్కొన్నారు. ఆ గ్రామాన్ని ఖాళీ చేసి గండ్రబంధం గ్రామ సమీపంలోని కొత్త చింతకుంట గ్రామానికి ఆనుకొని ఉన్న ఆళ్లపల్లి అటవీభూమిలో నివాసాలు ఏర్పర్చుకుంటామని గత ఏడాది ఆగస్టులో లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్తులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దీనిపై అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేదు.

మా బతుకులు మారాలి

గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. చిన్నప్పటి నుంచి ఇవే పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. నా చిన్నప్పుడు గ్రామం ఎలా ఉందో ఇప్పుడూ కూడా అలాగే ఉంది. మా బతుకుల్లో మార్పులు కావాలి. ఈ గ్రామంలో ఉంటే అది సాధ్యం కాదు. ప్రభుత్వం, అధికారులు మా గ్రామాన్ని పట్టించుకోవాలి.

- కోరం నర్సయ్య, గ్రామస్తుడు

ఈ ఊరు ఖాళీ చేస్తాం..

మా గ్రామంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. ఏ చిన్న సమస్య వచ్చినా వాగులు దాటి మరో గ్రామానికి వెళ్లాలి. వర్షాకాలంలో వాగులు పొంగి ఇళ్లల్లోకి నీరు వస్తోంది. అప్పుడు మేము చాలా ఇబ్బంది పడుతున్నాం. గ్రామాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించుకున్నాం. దీనిపై ఎంపీడీవోకు లేఖ రాశాం. మమ్మల్ని మరో ప్రాంతంలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పాయం సమ్మక్క, గ్రామస్తురాలు

పిల్లలకు భవిష్యత్తు లేదు..

ఎన్నో ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కాలంలో అనేక గ్రామాలు అభివృద్ధి చెందాయి. కానీ మా గ్రామం మాత్రం అలాగే ఉంది. గ్రామం చుట్టూ వాగు ఉండడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, బంధువులు రావాలన్నా ఇబ్బందే ఎదురవుతోంది. ఇక్కడే ఉంటే మాకు ఎలా ఉన్నా.. మా పిల్లల భవిష్యత్తు దెబ్బతింటున్నది. అందుకే గ్రామం ఖాళీ చేయాలని నిర్ణయించాం.

- పాయం మౌనిక, గ్రామస్తురాలు

ప్రభుత్వమే ఆదుకోవాలి..

మా గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదు. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ఐటీడీఏను ఏర్పాటు చేశారు. మాకు ఐటీడీఏ నిధులు కూడా రావడం లేదు. ఏ గ్రామంలో అయినా కనీస సౌకర్యాలైన రోడ్లు, మంచినీరు, విద్యుత్ సదుపాయం ఉంటుంది. మాకు ఒక్క విద్యుత్ సరఫరా మాత్రమే ఉంది. అది కూడా ఎప్పుడు ఉంటుందో తెలియదు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాన్ని ఖాళీ చేయాలని భావిస్తున్నాం. రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతానికి వెళ్తేనే మా బతుకులు మారుతాయి. మాపై దయ ఉంచి మాకు పునరావాసం కల్పించాలి.

- పాయం సురేష్, గ్రామస్తుడు

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 20 : భద్రతా బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పూర్ జిల్లాలో మావోయిస్టులకు కంచుకోట అయిన కచ్చపాల్ ప్రాంతంలో ఇటీవల భద్రతా దళాల ఆధ్వర్యంలో కొత్త క్యాంపును ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులను సైతం శరవేగంగా జరుపుతున్నారు. అయితే రోడ్డు నిర్మాణ పనులకు భద్రతగా ఉన్న డీఆర్‌జీ అప్పటికే ఆ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై అడుగు వేయడంతో అది ఒక్కసారిగా విస్ఫోటనం చెందింది. దీంతో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. దీనిని గమనించిన తోటి జవాన్లు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి వారిని మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలోని భద్రతా దళాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. మావోయిస్టుల కోసం జవాన్లు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

పాల్వంచ టౌన్, డిసెంబర్ 20: విద్యుత్ రంగ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల సుధాకర్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కరెంట్‌రావు, రాసూరి శ్రీనివాసరావు, యూసుఫ్, రాములు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించాలని వృద్ధురాలి విన్నపం

ఇల్లెందు, డిసెంబర్ 20: గత 54 ఏళ్లుగా తన ఆధీనంలో ఉన్న ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి తనకు ప్రాణ హాని ఉందని పట్టణంలోని 22వ వార్డుకు చెందిన విశ్రాంత ఉద్యోగిని యలగందుల మాణిక్యమ్మ తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. విలేకరులతో శుక్రవారం ఆమె వెల్లడించిన వివరాలు.. ఆమె 1967లో కొనుగోలు చేసిన స్థలంలో ఇటీవల ఇంటి నిర్మాణం ప్రారంభించారు. తన స్థలాన్ని కబ్జా చేసేందుకు స్థానికులు కొందరు కుట్రలు పన్నుతున్నారు. ఆమెపై దాడికి కూడా యత్నించారు. దీనిపై ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన స్థలానికి సంబంధించిన ఆధారాలను రెవెన్యూ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ అదికారులకు ఇచ్చారు. అయినప్పటికీ వారు విచారణ చేయలేదు, నిర్ణయం తెలుపలేదు. తనకు ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

జేకే ఓసీని సందర్శిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 20: సింగరేణి ఇల్లెందు ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఆయన శుక్రవారం ఏరియాలోని జేకే 5 ఓసీ ఉపరితల గనిని జీఎం వీసం కృష్ణయ్యతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి, రోజువారీ రవాణా లక్ష్యాలను అధిగమించేందుకు ఉద్యోగులు, అధికారులు మరింతగా కృషి చేయాలన్నారు. ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు , జేకే 5 పీవో కృష్ణమోహన్, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, సర్వే అధికారులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, సెక్యూరిటీ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ధర్నా

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 20: తమ గ్రామానికి కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలన్న డిమాండుతో మండలంలోని పోచారం గ్రామంలో మహిళలు శుక్రవారం పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకురాలు గుగులోత్ సరోజ మాట్లాడుతూ.. ఈ నెల 24న ఇల్లెందు డిపో ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

'సీఎం కప్'లో ఇల్లెందుకు ద్వితీయ స్థానం

ద్వితీయ స్థానంలో నిలిచిన ఇల్లెందు టీమ్

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 20: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో ఇల్లెందుకు ద్వితీయ స్థానం లభించిందని ఖోఖో మేనేజర్, కోచ్ రాంబాబు తెలిపారు. కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో సీఎం కప్ జిల్లా టోర్నమెంట్ శుక్రవారం జరిగింది. ఇల్లెందు మండలం నుంచి రాష్ట్ర స్థాయికి కిరణ్, వంశీ, శ్రావణ్, అనిల్, సతీష్ ఎంపికైనట్లు చెప్పారు. విజేతలను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ధన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ రవీందర్, సీఐ సత్యనారాయణ, ఎంఈవో స్వామి తదితరులు అభినందించారు.

శిశు మరణాలపై వైద్యుల విచారణ

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 20: మండలంలోని కొమరారం గ్రామంలో శిశు మరణాలపై కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత శుక్రవారం విచారణ జరిపారు. పారిశుధ్యం, వైద్య సంరక్షణ, పోషకాహారం తదితరాలపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. తల్లి పాలు తాగిన శిశువును కొద్దిసేపు భుజాన వేసుకుని అటూ ఇటూ తిప్పాలన్నారు. శిశువులు ఆయాసపడి ఏడ్చినప్పుడు వారికి వెంటనే పాలు తాగించవద్దని తల్లులకు సూచించారు.

భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో బాలభీముడు

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం అర్ధరాత్రి 5.25 కేజీలతో బాబు జన్మించాడు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన మడకం నందిని పురుటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు నొప్పులు ఎక్కువగా ఉండడంతో ఆపరేషన్ చేశారు. బాబు 5.25 కేజీలతో జన్మించాడని; తల్లీ, బిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

పేకాట రాయుళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

భద్రాచలం, డిసెంబర్ 20: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న జామాయిల్ తోటలో పేకాట రాయుళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.52,240 నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.